క్లుప్తంగా

10న కళాదర్బార్ ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కరించుకొని శ్రేష్ఠ హాస్పిటల్ సౌజన్యంతో ఈ నెల 10న వివిధ రంగాలలోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నట్లు కళాదర్బార్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పాత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై 10న సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, సినీ సంగీత విభావరిలు ఉంటాయని తెలిపారు. అనంతరం సినీ నటి శ్రీమణి, ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, డాక్టర్ షమ సుల్తానా, గాయని పి సుజాత, సాహితీవేత్త పచ్చిపులుసు సూర్యనారాయణ, నృత్య కళాకారిణి మహంకాళి నాగలక్ష్మిలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కుమార్, శేఖర్, బాబూరావు, బి. రాజశేఖర్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో యువతి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంకొండ మండలం బోధనం గ్రామానికి చెందిన తోట భూమిక (24) గుంటూరు నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ రామిరెడ్డితోటలో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా, భూమిక అనుమానాస్పద స్థితిలో మృతిచెంది పడి ఉంది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతురాలి పక్కన పలు ఇంజక్షన్లు ఉండటంతో, ఆమె చేసుకుందా.. మరేదైనా జరిగిందా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి సోదరుడు సాగర్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



తాడికొండ: తాడికొండ మండలం వద్దమాను గ్రామంలో 16 మంది వలంటీర్లు ఆదివారం మూకుమ్మడి రాజీనామాలు సమర్పించారు. ప్రజా సేవ చేస్తున్న తమపై నిందలు మోపుతూ చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడంపై వారు మండిపడ్డారు. వృద్ధులు, దివ్యాంగులకు సేవ చేసేందుకు అవకాశం లేనపుడు పదవులు ఎందుకని మూకుమ్మడి రాజీనామాలు సమర్పించామని తెలిపారు. త్వరలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకొని మళ్లీ వలంటీర్లుగా చేరి రెట్టింపు సేవలందిస్తామన్నారు.

కరాటే గ్రేడింగ్ పరీక్షలు

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనారాయణ స్వామి గుడి ఎదుట ఉన్న కరాటే స్కూలులో గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన పోటీలలో ఎంఎంకే స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, పెదవడ్లపూడికి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కరాటే శిక్షకులు నరసయ్య, గణేష్, జీకే శేఖర్, డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

ఫిరంగిపురం: అనారోగ్యం కారణంగా మతిస్థిమితం లేని వ్యక్తి పురుగుమందు తాగి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన కె.రాంబాబు గతంలో గొర్రెలు పెంచుకునేవాడు. ప్రస్తుతం వ్యవసాయ పనులకు వెళుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం కారణంగా మతిస్థిమితం లేదు. దీంతో శుక్రవారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. మరునాడు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కనే పురుగుమందు డబ్బా పడిఉంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరనారాయణ తెలిపారు.

రేపు ఉగాది ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 9వ తేదీన ఉగాది పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామునుంచి ప్రత్యేక పూజలతో స్వామివారికి విశేష ముత్యాల అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. ఉగాది పచ్చడి పంపిణీ, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

నసీర్‌కు సహకరించలేం !

- అసమ్మతి వర్గం స్పష్టీకరణ
- నయోధ్యకు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని యత్నం
- నసేమిరా అంటూ వెళ్లిపోయిన నేతలు



పెమ్మసాని కార్యాలయంలో జరిగిన సమావేశంలో నసీర్ అహ్మద్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పార్టీ నేతలు

పట్నంబజారు: ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నసీర్‌కు తాము సహకరించలేమని అసమ్మతి వర్గం కరాఖండిగా చెప్పినట్లు సమాచారం. ఇటీవల టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హాజరు కాని, నసీర్‌కు వ్యతిరేకంగా ఉన్న క్యాడర్‌తో శనివారం రాత్రి బృందావన్ గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో పెమ్మసాని సమావేశం ఏర్పాటు చేశారు. నసీర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తే నేతలు ఎవరూ రామని తేల్చిచెప్పటంతో పెమ్మసాని కార్యాలయంలో ఏర్పాటు చేశారు. నసీర్‌కు సహకరించాలని కోరడంతో టీడీపీ క్యాడర్ మొత్తం అగ్గి మీద గుగ్గిలం అయినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ ఎన్నికలు అయ్యి మూడేళ్ల గడిచిన తరువాత నసీర్ కనీసం పలకరించిన పాపాన పోలేదని, కేవలం తన అనుచర వర్గాన్ని పెట్టుకునే డివిజన్‌లలో కూడా తిరుగుతున్నారని తిరగబడినట్లు తెలిసింది. పెమ్మసాని ఎంత బతిమాలినా క్యాడర్ నసేమిరా అని అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు చెప్పుకుంటున్నారు. కాపు సామాజికవర్గానికి చెందిన డేగల ప్రభాకర్, ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన జనసేన నేత నేరళ్ల సురేష్‌కు కూడా కనీసం విలువ ఇవ్వని పరిస్థితుల్లో ఆ సామాజిక వర్గానికి చెందిన వారు నసీర్ తీరుపై మండిపడుతున్నారు.

బాబుకు ఫిర్యాదు

తూర్పు నియోజకవర్గంలో నసీర్ వ్యవహరిస్తున్న తీరుపై టీడీపీ అగ్రశ్రేణి, ద్వితీయ శ్రేణి నేతలు చంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దశాబ్దాలుగా పార్టీలో పనిచేస్తున్న వారిని పక్కన పెట్టి, ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంపై చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. సత్తెనపల్లిలో ఆదివారం జరిగిన సమీక్ష సమాశంలో నసీర్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు చెప్పుకుంటున్నారు.

సర్వమత సమానత్వానికి ప్రతీక ఇఫ్తార్

భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ సర్వమత సమానత్వానికి ప్రతీక అని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. ఆదివారం గోరంట్లలోని టెస్ట్ విద్యార్థుల క్యాంపస్‌లో భాష్యం విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ముస్లిం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో పాటు విద్యార్థినీ, విద్యార్థులకు భాష్యం రామకృష్ణ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలు అల్లాహ్ ఆశీస్సులు పొంది ఆయురారోగ్యాలు, సంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అరబిక్ లెక్చరర్ డాక్టర్ షేక్ మహమ్మద్ ఇషాక్ నద్వి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఆయన ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ ఉపవాస దీక్ష చేసే వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం వల్ల వారితో సమానంగా అల్లాహ్ నుంచి పుణ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు పాల్గొన్నారు.

క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన



వాక్యోపదేశం చేస్తున్న బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి

ఫిరంగిపురం: కారుణ్య జపం, క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన జరుగుతుందని బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో పునరుత్థానం తరువాత వచ్చే ఆదివారం దివ్యభారతి ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ సిలువపై ఉన్న క్రీస్తును సైనికులు బల్లెంతో పక్కలో పొడిచిన ప్పుడు శరీరం నుంచి రక్తం, నీరు వచ్చిందన్నారు. వాటితో భక్తుల పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు. అదేవిధంగా ఒక వైపు చీకటి, ఒక వైపు వెలుగు ఎలా ఉంటుందో అదేవిధంగా దివ్యకారుణ్యం అనేది నిండి ఉంటుందని చెప్పారు. క్రైస్తవ సంఘం విధులు నాలుగు ఉన్నాయన్నారు. అవి అపోస్తలుల బోధ, సహవాసం, రొట్టె విరవడం, సంఘంగా కుటుంబం ప్రార్థనలు చేయడం ద్వారా శక్తి ఏర్పడుతుందని తెలిపారు. దానిలో బలం, ధైర్యం నిండి ఉంటాయన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. ప్రార్థనలో ఫాదర్ విలియమ్స్, సహాయ విచారణ గురువు ఆర్.అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు సీఎం జగన్ అండ

తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకుడు నారా లోకేష్ 2014–2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలపై దాడులు జరగలేదని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనార్టీలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామనడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ పాలనలో మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. గుంటూరులో నిర్వహించిన నారా హమారా కార్యక్రమంలో ఎనిమిది మంది ముస్లిం యువకులు మైనార్టీ మంత్రి లేని రాష్ట్రం అని, తమ సమస్యలపై తమ బాధను, డిమాండ్‌లను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తే న్యాయం జరుగుతుందని భావించి ప్లకార్డులు ప్రదర్శిస్తే, వారిని దేశద్రోహులుగా చిత్రీకరించి అక్రమ కేసు బనాయించి మానసిక క్షోభకు గురిచేశారన్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ కేసులను ఉపసంహరించుకున్న విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ముస్లిం మైనార్టీలకు కల్పిస్తున్న 4 శాతం రిజర్వేషన్‌ను తెలుగు రాష్ట్రాల్లో సంపూర్ణంగా రద్దు చేస్తామని బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఇప్పటికే ప్రకటించారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి సముచిత స్థానం కల్పిస్తే, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి అన్ని రంగాల్లో మైనార్టీలకు అండగా నిలుస్తున్నారని అన్నారు.

జనసేన బెదిరింపులకు భయపడేది లేదు

- 175 నియోజకవర్గాల్లో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ పోటీ
- పార్టీ నాయకుడు డి.నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంగళగిరి: జనసేన బెదిరింపులకు భయపడేది లేదని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో పోటీచేస్తుందని ఆ పార్టీ నాయకుడు డి.నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ గుర్తు బక్కెట్, జనసేన గుర్తు గ్లాసు ఒకేలా ఉన్నాయనే కారణంగా పోటీ నుంచి మా అభ్యర్థులును తొలగించాలని జనసేన నాయకులు విజయవాడ హోటల్‌కు పిలిపించి గన్‌తో బెదిరించి పది బి.ఫారాలు తీసుకెళ్లారని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరారు. నాయకులు డి.వెంకటేశ్వరరావు, జి.రామారావు, షేక్ బాషా, షేక్ మస్తాన్, సయ్యద్, ఎస్‌కే గబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

పోలకంపాడులో పంట పొలాల్లో అగ్నిప్రమాదం

- భారీఎత్తున ఎగిసిపడిన మంటలు
- సకాలంలో స్పందించి ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పోలకంపాడులో పాత జాతీయ రహదారికి, గుంటూరు చానల్‌కు, ఉండవల్లి ఎస్సీ కాలనీ కరకట్టకు మధ్యలో ఉన్న పంట పొలాల్లో పంట వ్యర్థాలకు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దాదాపుగా 10 ఎకరాల్లో కోసిన వరికంకుల మోళ్లు ఉండడం, చెత్తా చెదారం ఉండడంతో చుట్టుపక్కల ఉన్న ముళ్ల పొదలకు మంటలు వ్యాపించాయి. ఆ మంటలు ఉండవల్లి ఎస్సీకాలనీ కరకట్ట వెంబడి దేవాలయ భూముల్లో ఉన్న నివాసాలవైపు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని, సుమారు 4 ఎకరాల పొలంలో వ్యాపించిన మంటలను అదుపుచేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ఎత్తున మంటలతో పాటు పొగకూడా వ్యాపించడంతో స్థానికులు ఎండ తీవ్రతకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఈద్గా గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గడిచిన రెండువారాలుగా ప్రీమియర్ లీగ్ సీజన్–3 పోటీలు ఆదివారం ముగిసినట్లు తెలిపారు. ఫైనల్ పోటీల్లో యాంగ్రీ టైగర్స్ టీంపై రాయల్ ఫైటర్స్ టీం క్రీడాకారులు గెలుపొందారు. వారికి మాజీ సర్పంచ్ నాగుల్ మీరా షరీఫ్ రూ.10,116లు బహుమతి నగదు అందజేశారు. రెండో బహుమతిని రన్నరప్ టీం సభ్యులకు రూ.5,116 నగదును సొసైటీ చైర్మన్ షేక్ ఖాజావలి అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పెదజానీ, బెస్ట్ బౌలర్‌గా రాణాలకు ఒక్కొక్కరికి రూ.1500 నగదును షేక్ ఇమాం ఖాజావలి అందజేశారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన చంద్రిక



మంగళగిరి: ఈనెల 8వ తేదీ నుంచి 1 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలకు రాష్ట్రం తరఫున మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక ఎంపికయినట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో చంద్రికను గుంటూరు జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ చంద్రిక 84 కేజీల విభాగంలో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. చంద్రిక పోటీలలో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని కోరుతూ అభినందించిన వారిలో అసోషియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయభాస్కరావు, షేక్ సంధాని, మద్ది ప్రభాకర్, సకల సూర్యనారాయణ, సకల కోటేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కాకుమాను: పెదనందిపాడు మండలంలోని పాలపర్రులో అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని, వాహనాన్ని ఆదివారం వేకువజామున అదుపులోకి తీసుకున్నట్లు పెదనందిపాడు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పాలపర్రు గ్రామం నుంచి ఆదివారం వేకువజామున సుమారు నాలుగు గంటల సమయంలో ఏపీ 39 యుసీ 1610 నంబరు గల వాహనంలో 80 బస్తాలు(40 క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో కాపు కాసి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూశాఖ అధికారులు అందజేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు



మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేలా కృషి చేయాలని పలువురు ప్రతినిధులు కోరారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గాలకు రెండు రోజుల పాటు నగర పరిధిలోని చినకాకాని హాయ్‌ల్యాండ్‌లో నిర్వహించిన అభ్యసన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా హాజరైన ప్రతినిధులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, సేవా కార్యక్రమాలను ఎలా విస్తృతం చేయాలనే అంశాలపై వివరించారు. ప్రతినిధులు శరత్ చౌదరి, బీవీపీ రాజు, అన్నే రత్నప్రభాకర్, అందే రేవంత్, గాజుల శ్రీనివాసరావు, ఇసునూరి అనిల్ చక్రవర్తి, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, అందే మురళి, నిరంజన్ గుప్తా, కేవీఎస్ ప్రకాశరావు, కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పేదలకు అత్యాధునిక వైద్యం

- సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్
- ఘనంగా వరల్డ్ హెల్త్ డే వేడుకలు



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్. వేదికపై సీనియర్ సివిల్ జడ్జి లీలావతి తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆదివారం శుశ్రుత హాలులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది నా ఆరోగ్యం..నా హక్కు నినాదాన్ని తీసుకుందన్నారు. దీన్ని ముగ్గురికి చేరవేయాలని వారు మరో ముగ్గురికి సమాచారం అందించాలని సూచించారు. సాంఘిక దురాచారాలు, మంత్రాలు, తంత్రాలు వంటివి పని చేయవన్నారు. మనిషిని బతికించేది సైన్స్ అనే విషయాన్నీ ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి టి. లీలావతి మాట్లాడుతూ ఆరోగ్యం గురించి ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోగుల్లో ఆత్మవిశ్వాసం పెరిగే విధంగా వైద్య సిబ్బంది పని చేయాలని చెప్పారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ రోగులకు సహృదయంతో నర్సులు వైద్య సేవలు అందించాలని సూచించారు. వరల్డ్ హెల్త్ డేపై ప్రజలకు అవగాహన కోసం ముందుగా నర్సింగ్ విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ నుంచి ఏసీ కళాశాల, నాజ్ సెంటర్ మీదుగా తిరిగి జీజీహెచ్‌కు చేరుకుంది కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, అడ్మినిస్ట్రేటర్ బి. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి బాజీబాబా దర్గా ఉరుసు

పెదకాకాని: సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 536వ ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో సోమ, మంగళవారాలలో రెండు రోజుల పాటు బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరుగుతుందని తెలిపారు. ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని బాజీబాబా దర్గాలో ప్రత్యేక అలంకరణ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు.

- ఈనెల 8వ తేదీ వేకువ జామున ప్రార్థనలతో ఉరుసు మహోత్సవం ప్రారంభమవుతుంది.
- సాయంత్రం 5 గంటలకు చాందిని అలంకరణ
- రాత్రి 10 గంటలకు ముస్లింపాలెం జెండా చెట్టు వద్ద నుంచి బాబావారి గంథం, గుర్రంపై గొప్ప ఊరేగింపు.
- ఊరేగింపు ముగించుకుని బాబావారి గుర్రం 9వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు దర్గాకు చేరుకుంటుంది.
- అనంతరం భక్తులకు గంథం పంచిపెట్టడం, దీపారాధన, ఖురాన్ పఠనం, సలామి ప్రార్థనలతో ఉరుసు మహోత్సవం ముగుస్తుందన్నారు. ఉరుసు నిర్వహణకు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా బాజీబాబా దర్గా ప్రాంగణం అంతటా విద్యుత్ కాంతులతో కళకళలాడుతుంది. దర్గా సిబ్బంది సత్తార్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

'కాయితాల రుజువు' కథల సంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వరలక్ష్మి, లక్ష్మీనారాయణ తదితరులు

పాత గుంటూరు: నమ్మిన సిద్ధాంతాల కోసం రచనలు చేస్తున్న ప్రముఖ రచయిత్రి నల్లూరి రుక్మిణి అభినందనీయులని అరుణతార పత్రిక వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వరలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ సమావేశ మందిరంలో నల్లూరి రుక్మిణి రచించిన ' కాయితాల రుజువు' కథా సంపుటిని వరలక్ష్మి ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో ఫైనాన్స్ పెట్టుబడిదారులు చేస్తున్న విధ్వంసాన్ని, సంక్షోభాన్ని, కుటుంబ జీవితాల్లోని మనుషుల వ్యక్తిత్వాలను, వెతలను కథల సంపుటిలో కళ్లకు కట్టినట్లు చూపారని తెలిపారు. ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ సమకాలిన సమస్యలకు శ్వేత పత్రం లాంటిది కాయితాల రుజువు పుస్తకం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రచయిత్రి రుక్మిణి 'కాయితాల రుజువు' కథల సంపుటి ఆలోచనలను రేకెత్తిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, విరసం సి.ఎస్.ఆర్. ప్రసాద్, కాపు శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, పలువురు రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

మంగళగిరి: పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో స్ఫూర్తిప్రదాతలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తమ జీవితం ద్వారా సమాజంలో స్ఫూర్తినింపిన 20 మంది మహోన్నత వ్యక్తుల గురించి ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజాక్ హుస్సేన్ రచించిన పుస్తకం ఎందరికో స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మంచా విజయరామ్మోహన్‌రావు, బీవీడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రావి రంగారావు, డాక్టర్ మన్నవ సత్యనారాయణలు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, రేఖా కృష్ణార్జునరావు, మంచా విజయమోహనరావు, గోలి మధు, కంచర్ల కాశయ్య, సిందే బాలకృష్ణ, చిలకా వెంకటేశ్వరరావు, రేఖా నర్మద తదితరులు పాల్గొన్నారు.

శలపాడులో గాయత్రీ హోమం



చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో ఆదివారం గాయత్రీ హోమం వైభవంగా నిర్వహించారు. శలపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం గాయత్రీ యజ్ఞాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. గంజాం సత్యనారాయణచార్యులు, మహేంద్రబాబుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలిరూరల్: జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. తెనాలిలోని మార్కెట్ వద్ద తూర్పు కాల్వలో నీరు లేకపోవడంతో వంతెన కింద ఆదివారం ఎనిమిది మంది పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని రూ. 8,300 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ మారీసుపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి ఆదివారం 10 క్వార్టరు సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.